క్లుప్తంగా

నేడు రామానుజ జీయర్ స్వామి రాక

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయానికి త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి వస్తున్నారని ఆలయ చైర్మన్ మనోహర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ధనుర్మాస పూజలు హిందు ధర్మం గొప్పతనాన్ని భక్తులకు వివరిస్తారని ఆయన చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి మంగళవారం స్వామి చెప్పే బోధనలు తెలుసుకోవాలని మనోహర్ కోరారు.

పింఛన్ల కోసం వృద్ధుల పడిగాపులు



పెద్దకొత్తపల్లి: చెన్నపురావుపల్లి గ్రామపంచాయతీ వద్ద వృద్ధులు, వితంతువులు, వికలాంగులు పింఛన్ల కోసం సోమవారం పడిగాపులు కాశారు. కుడికిల్ల బీపీఎం అశోక్ ప్రతి నెల చెన్నపురావుపల్లికి వచ్చి పింఛన్లు పంపిణీ చేసి వెళ్తాడు. పింఛన్లు సకాలంలో పంపిణీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయంపై ఎంపీడీఓ నాగేందర్‌ను కోరగా, ప్రతి గ్రామంలో పింఛన్లు సకాలంలో పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

బీసీ రిజర్వేషన్లపై కవిత మాట్లాడడం విడ్డూరం

నాగర్‌కర్నూల్‌రూరల్: బీసీ రిజర్వేషన్లపై బీఆర్‌ఎస్ పార్టీ నాయకురాలు కవిత మాట్లాడడం విడ్డూరంగా ఉందని పేర్కొంటూ బీసీ సంక్షేమ సంఘం నాయకులు సోమవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఆ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్‌గౌడ్, నాయకులు కాళ్ళ నిరంజన్ తదితరులు మాట్లాడారు. గత ప్రభుత్వంలో లోకల్‌బాడీలలో బీసీ రిజర్వేషన్లు అన్యాయంగా తప్పించింది కేసీఆర్ అని అన్నారు. 2014లో చేసిన సమగ్ర కుటుంబ సర్వే రిపోర్ట్ ఉండి కూడా బీసీలకు అన్యాయం చేశారన్నారు. మళ్లీ కవిత బీసీ రిజర్వేషన్లపై మాట్లాడకూడదని హెచ్చరించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



తాడూరు: మండలంలోని ఇంద్రకల్, ఐతోలు, శిర్సవాడ, పాపగల్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీఓ బ్రహ్మచారి సోమవారం పరిశీలించారు. భోజన నిర్వాహకులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. గ్రామాలలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే, గ్రామపంచాయతీలోని రికార్డులను పరిశీలించారు.


సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు సోమవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హైదరాబాదులోని ఆయన నివాసంలో ప్రభుత్వం మంజూరు చేసిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కల్వకుర్తి మార్కెట్ డైరెక్టర్ కేశమల్ల కృష్ణ, ఆంజనేయులు, అనిల్‌కుమార్, మల్లేష్, సురేష్ ఉన్నారు.

ప్రత్యేక గ్రామ పంచాయతీ చేయాలని వినతి

వెల్దండ: మండలంలోని గొల్లోనిపల్లి గ్రామాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం గ్రామ నాయకులు తహసీల్దార్ కార్తీక్‌కుమార్, ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డికి వేర్వేరుగా వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై అధికారులు మాట్లాడుతూ గొల్లోనిపల్లిని ప్రత్యేక పంచాయతీ ఏర్పాటుకు ఇప్పటికే నివేదికను సిద్ధం చేసి జిల్లా అధికారులకు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సాలయ్య, జగన్, మల్లేష్, భాను ప్రకాష్, రమేష్, క్రిష్ణయ్య ఉన్నారు.

బేడ బుడగ జంగాల జెండా ఆవిష్కరణ



పెద్దకొత్తపల్లి: బేడ బుడగ సంఘాల హక్కుల పోరాట సమితి 23వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మండల కేంద్రంలో సోమవారం కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కుమార్, యాదగిరి, రాములు పాల్గొన్నారు.

■ నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మాజిపేటకు చెందిన వ్యక్తి ఈ ఏడాది ఫిబ్రవరి 4న ఆన్‌లైన్‌లో ఉన్న అడ్వర్టైజ్మెంట్ చూసి అందులోని నంబర్‌కు ఫోన్ చేశాడు. అతి తక్కువ ధరకే కారు వస్తుందనే ప్రకటన చూసి సంప్రదించగా, వాళ్లు నమ్మించి అడ్వాన్స్ కింద రూ.30,350 ఫోన్ పే చేయించుకున్నారు. తర్వాత ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీస్‌లను సంప్రదించాడు.


■ నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో ఓ వ్యాపారికి అజ్ఞాత వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. పర్వతాలు గారు.. నేను మీ మున్సిపాలిటీ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నాను. మీ ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేయాలంటూ తన ఫోన్ నెంబర్‌కి రూ.9,800 ఫోన్ పే చేయించుకున్నాడు. డబ్బులు పంపాక రసీదు ఇవ్వకపోవడం, ఫోన్ ఎత్తకపోవడంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు.

■ ఫిబ్రవరి 2న నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రానికి చెందిన ఓ వ్యాపారికి అపరిచిత వ్యక్తి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. తాను బ్యాంకు అధికారిగా చెబుతూ.. ఏటీఎం కార్డు రెన్యువల్ కోసం ఓటీపీ కావాలని అడిగాడు. బాధితుడు ఓటీపీ నంబర్ చెప్పగా ఆయన ఖాతాలోని రూ.6,99,000 మాయమయ్యాయి. షాక్ తిన్న బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సైబర్ మాయ!

ఉమ్మడి పాలమూరును బెంబేలెత్తిస్తున్న సైబర్ మోసాలు

- గత సంవత్సరంతో పోలిస్తే 15.42 శాతం పెరిగిన నేరాలు
- ఈ ఏడాది అమాయకుల నుంచి రూ.10 కోట్ల మేర దోపిడీ



కొల్లగొట్టింది రూ.10 కోట్లు.. రికవరీ రూ.28.15 లక్షలే..

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్ : ఈ ఏడాది 15.42 శాతం పెరిగిన కేసులు.. ఉమ్మడి పాలమూరు జిల్లాలో గతేడాదిలో 1,766 సైబర్ కేసులు నమోదు కాగా.. ఈ సంవత్సరం 2,724 నమోదయ్యాయి. ఈ లెక్కన 15.42 శాతం మేర సైబర్ నేరాల శాతం పెరిగినట్లు తెలుస్తోంది. గత ఏడాదితో పోలిస్తే ఒక్క నారాయణపేట జిల్లాలోనే సైబర్ నేరాల సంఖ్య తగ్గగా.. మిగతా అన్ని జిల్లాల్లోనూ పెరిగాయి. నమోదైన కేసులు కొన్ని మాత్రమే కాగా.. తమ పేర్లు బయటకు వస్తాయని, ఇతరత్రా కారణాలతో ఫిర్యాదు చేయని వారే అధిక సంఖ్యలో ఉంటారని పోలీసులు అంచనా వేస్తున్నారు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సైబర్ కేటుగాళ్లు ఈ సంవత్సరంలో అమాయకుల నుంచి రూ.10.05 కోట్లు కొల్లగొట్టారు. ఇందులో 28.15 లక్షలు మాత్రమే రికవరీ కాగా..పోలీసులు న్యాయప్రక్రియ పూర్తి చేసి ఆయా బాధిత వ్యక్తులకు అందజేశారు. బ్యాంకుల్లో ఫ్రీజ్ అయినవి సుమారు రూ.2 కోట్ల వరకు ఉండొచ్చని అంచనా. అంటే సైబర్ కేటుగాళ్లు మిగతా సొమ్మును మింగేసినట్లు అర్థమవుతోంది.

జిల్లాల వారీగా ఇలా..

■ మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ ఏడాదిలో సైబర్ నేరగాళ్లు సుమారు రూ.4 కోట్ల వరకు కొల్లగొట్టినట్లు అంచనా. ఇందులో కేవలం రూ.55,000 రికవరీ అయ్యాయి.

■ నాగర్‌కర్నూల్ జిల్లాలో సైబర్ మోసగాళ్లు అమాయకుల నుంచి రూ.57,96,325 దోచుకోగా.. పోలీసులు వారి నుంచి రూ.10,08,278 రికవరీ చేశారు.

■ గద్వాల జిల్లాలో సైబర్ కేటుగాళ్ల బారిన పడిన అమాయకులు రూ.3,83,50,299 కోల్పోగా.. పోలీసులు 10,59,051 రికవరీ చేశారు. ఇవి పోనూ పలువురు బాధితులకు సంబంధించిన రూ.55,29,181 పలు బ్యాంక్‌లలో ఫ్రీజింగ్‌లో ఉన్నాయి.

■ నారాయణపేట జిల్లాలో రూ.13,13,000కు గాను ఇప్పటివరకు పోలీసులు రూ.1,63,000 మాత్రమే రికవరీ చేయగలిగారు.

■ వనపర్తి జిల్లాలో రూ.1.50 కోట్లకు గాను ఇప్పటి వరకు కేవలం రూ.5.30 లక్షలు రికవరీ అయినట్లు పోలీస్ రికార్డులు చెబుతున్నాయి.

1930 లేదా డయల్ 100కు ఫిర్యాదు చేయాలి..

సైబర్ నేరాలపై ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. సైబర్ మోసానికి గురైనట్లు తెలిసిన వెంటనే 1930 లేదా డయల్ 100కు ఫోన్‌చేస్తే నిందితుల ఖాతాలను స్తంభింపజేయవచ్చు. తద్వారా కోల్పోయిన సొమ్ము రికవరీ చేసేందుకు అవకాశం ఉంటుంది. సైబర్ నేరగాళ్లు ఇటీవల కాలంలో కొత్త పంథాలో నేరాలకు పాల్పడుతున్నారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్లు, మెసేజ్‌లకు స్పందించొద్దు.

– రామేశ్వర్, ఏఎస్పీ, నాగర్‌కర్నూల్

అవగాహన కల్పిస్తున్నా..

సైబర్ నేరాలపై పోలీస్ శాఖ ప్రతి సంవత్సరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ ఏడాది సైతం క్షేత్రస్థాయిలో వ్యాపారులతో పాటు మున్సిపాలిటీల పరిధిలోని కాలనీల్లో, మండలాల పరిధిలో గ్రామాల్లో విస్తృతంగా అవగాహన క్యాక్రమాలు చేపట్టింది. మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో 483, నాగర్‌కర్నూల్ జిల్లాలో 1,080, నారాయణపేటలో 328, గద్వాల, వనపర్తిలో 400 వరకు అవగాహన సదస్సులు నిర్వహించారు. అయినా సైబర్ మోసాలకు అడ్డుకట్ట పడకపోవడం ఆందోళన రేపుతోంది.

ఇలా మోసపోతున్నారు..

జిల్లాలో నమోదైన సైబర్‌క్రైం కేసుల్లో అధికంగా ఫేక్ యాప్‌లలో అధిక లాభాలకు ఆశపడి పెట్టుబడి పెట్టి నష్టపోయిన వారే ఉన్నారు. ఏపీకే యాప్ లింక్‌లపై టచ్ చేసి ఖాతాల్లోని నగదును పోగొట్టుకున్న ఘటనలు కూడా ఉన్నాయి. బ్యాంకుల్లో రుణం ఇప్పిస్తాం.. కొంత డబ్బులు డిపాజిట్ చేయాలని, క్రెడిట్ కార్డు బిల్స్ క్లియర్ చేస్తామని చెప్పి ఆన్‌లైన్‌లో లింక్‌లు పంపించి.. ఫోన్ కాల్స్, బ్యాంక్ ఏటీఎంల పేరుతో నగదు అపహరించినట్లు కేసులు నమోదయ్యాయి. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోతున్న వారిలో విద్యాధికులే ఉండడం గమనార్హం. అత్యాశే ఇందుకు కారణమని పోలీసులు చెబుతున్నారు.

మహాచండీ హోమం



తిమ్మాజిపేట: మండలంలోని అప్పాజిపల్లి సమీపంలోని అప్పాద్రి గుట్టపై వెలిసిన స్వయంభూ శ్రీలక్ష్మీనర్సింహస్వామి సన్నిధిలో సోమవారం మహాచండీ హోమం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు వేదం క్రిష్ణమూర్తి ఆధ్వర్యంలో స్వామి వారి ఆలయ ఆవరణలో చండీ హోమం జరిపించారు. ఈసందర్భంగా భక్తులకు ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి, హేమలత దంపతులు అన్న ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

త్రైతసిద్ధాంతంపై ప్రజలకు అవగాహన



తెలకపల్లి: మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామంలో సోమవారం త్రైతసిద్ధాంత గ్రంథంపైన ప్రచారం నిర్వహించారు. త్రైతసిద్ధాంత భగవద్గీత గ్రంథంపైన నిర్వాహకులు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. త్రైతసిద్ధాంత సేవాసమితి, హిందూ జ్ఞానవేదిక అచ్చంపేట, నాగర్‌కర్నూల్ కమిటీ సభ్యులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సాయిశంకర్, మనోహర్, నర్సింహ, ఆత్మారాం, ఆంజనేయులు, వెంకటయ్య, భాస్కర్, ఊశయ్య, పార్వతమ్మ, రమాదేవి, మంజుల, గీత, సుష్మ, అనిత పాల్గొన్నారు.

జిల్లెల్ల అభివృద్ధికి సహకరించాలని వినతి



కల్వకుర్తి రూరల్: మండలంలోని జిల్లెల్ల గ్రామాభివృద్ధికి సహకరించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కోరినట్లు జిల్లెల్ల మాజీ సర్పంచ్ రాములు చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

చారకొండ: ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిని మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సునిత అన్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ఎలాంటి ఫిర్యాదులు అందలేదని తెలిపారు. సమావేశంలో అధికారులు డీటీ విద్యాధరి, ఆర్‌ఐలు భరత్, రామకృష్ణ, పశువైద్య అధికారి శివకుమార్ ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడుగురికి శిక్ష

కల్వకుర్తి రూరల్: మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. సోమవారం న్యాయమూర్తి ఏడు మందికి రెండు రోజుల జైలు శిక్ష, రూ.100ల చొప్పున జరిమానా విధించినట్లు ఎస్సై మాధవరెడ్డి తెలిపారు

మారేపల్లికి చేరిన సత్యశోధన పాదయాత్ర

తిమ్మాజిపేట: బాబు బాటలో సత్యశోధన పాదయాత్ర సోమవారం తిమ్మాజిపేట మండలం మారేపల్లికి చేరింది. విశ్రాంత జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ విజయ్‌కుమార్ పాదయాత్ర చేస్తున్నారు. గాంధీజీ ఆశయాలు, ఆయన చూపిన మార్గాలను విద్యార్థులకు, యువకులకు తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ఆలంపూర్ జోగుళాంబ దేవాలయం నుంచి పాదయాత్ర ప్రారంభించారు. జనవరి 11న అచ్చంపేటలో పాదయాత్ర ముగింపు సభకు గాంధీజీ మనవడు తుషార్ గాంధీని ఆహ్వానించినట్లు ఆయన తెలిపారు. పాఠశాలకు ఆయన చెస్‌బోర్డు అందజేశారు. పాదయాత్రకు హెచ్‌ఎం హేమలత, ఉపాధ్యాయులు లక్ష్మణ్‌రావు, ఎండీ ఇబ్రహీం, నటరాజ్, సుచరితలు స్వాగతం పలికారు.

పోతేపల్లిలో 7మేకలు చోరీ

వెల్దండ: మండలంలోని పోతేపల్లికి చెందిన ఉడుత లాలయ్యకు చెందిన 7మేకలను ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు రైతులు తెలిపారు. బాధితుల వివరాల ప్రకారం.. లాలయ్య అనే రైతుకు చెందిన 11మేకలను ఇంటి ఆవరణలో షెడ్‌లో ఆదివారం రాత్రి కట్టేశాడు. రోజువారీగా నిద్రించాడు. అర్ధరాత్రి లాలయ్య మేకల షెడ్‌లో చూసే సరికి 7మేకలు చోరీకి గురైనట్లు గుర్తించి, వెంటనే 100 ఫోన్ చేశాడు. అప్రమత్తమైన పోలీసులు చుట్టుపక్కల వెతికినా లభించలేదు. సోమవారం ఉడుత శ్రీశైలం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు.

మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్



తపస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు రానున్న పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టర్ తన ఛాంబర్‌లో సోమవారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత ప్రమాణాలు పాటించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రమేష్‌కుమార్, తపస్ జిల్లా అధ్యక్షులు దెంది రాజారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మనమోని శేఖర్ ,తపస్ రాష్ట్ర, జిల్లా బాధ్యులు, మండల శాఖ బాధ్యులు, తపస్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ 55వ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

నాగర్‌కర్నూల్: పట్టణంలో సోమవారం ఎస్‌ఎఫ్‌ఐ 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తారాసింగ్ ఎస్‌ఎఫ్‌ఐ జెండాను ఎగురవేసి మాట్లాడారు. 1970 డిసెంబర్ 30న కేరళ రాష్ట్రంలోని త్రివేండ్రంలో అధ్యయనం, పోరాటం అనే నినాదంతో ప్రజాస్వామ్యం, సోషలిజం అనే లక్ష్యాలతో 11 మందితో సంఘం ఏర్పాటైందన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నాటి నుంచి నేటి వరకు అనేక పోరాటాలు జరిగాయని గుర్తు చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పరిష్కరించి రావాల్సిన ఫీజురియింబర్స్‌మెంట్ ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అభిరాం, దర్వేష్, తులసీ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై దౌర్జన్యం చేసిన దుండగులను శిక్షించాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు బాలకిష్టయ్య

నాగర్‌కర్నూల్ రూరల్/ మన్ననూర్: రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు ఏ రాములుపై దౌర్జన్యం చేసిన దుండగులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కేవీపీఎస్, డీవైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ అయ్యప్పమాల వేసుకున్న 8వ తరగతి విద్యార్థికి హెచ్‌ఎం కాలు తగిలిందని, దుండగులు దౌర్జన్యం చేశారని ఆరోపించారు. తక్షణమే హెచ్‌ఎంను మానసిక ఒత్తిడికి గురిచేసి, భయభ్రాంతులకు గురి చేసిన దుండగులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆర్ శ్రీనివాసులు, వర్ధం పర్వతాలు, గుంపల్లి అశోక్, కేవీపీఎస్ నాయకులు అంతటి కాశన్న, శ్రీను, సత్యనారాయణ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు తారాసింగ్, సైయ్యద్, బాబు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

■ ప్రధానోపాధ్యాయుడిపై దాడి చేసిన దుండగులను అరెస్టు చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు జక్క బాలకిష్టయ్య డిమాండ్ చేశారు. పాఠశాలలో మతోన్మాదుల జోక్యం సరైంది కాదని, ప్రభుత్వ ఉన్నతాధికారులు గ్రహించి తక్షణమే కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సామ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు మండల స్థాయి ప్రతిభా పరీక్షలు



ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కందనూలు/ తిమ్మాజిపేట: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుల వేదిక ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు మండల స్థాయి ప్రతిభా పరీక్ష నిర్వహించారు. మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు ప్రతి మీడియం నుంచి ముగ్గురు పరీక్షలో పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు సిద్ధికి ఉస్సేన్ పరీక్ష పత్రాలను ఆవిష్కరించారు. ప్రతి మీడియం నుంచి ముగ్గురు విద్యార్థులను జిల్లా స్థాయి పరీక్షకు ఎంపిక చేశారు. మండల స్థాయిలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. తిమ్మాజిపేటలో నిర్వహించిన మండల స్థాయి సాంఘీక శాస్త్రం ప్రతిభ పరీక్షలో పోతిరెడ్డిపల్లి విద్యార్థి శివ కుమార్ ప్రథమ స్థానంలో నిలిచా డు. తెలుగు మీడియంలో ఆవంచ విద్యార్థి వెంకటేష్ ప్రథమ స్థానంలో నిలిచారు. ఎంఈఓ సత్యనారాయణశెట్టి, హెచ్‌ఎం ఉమాపతిరెడ్డి, పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

మర్రి జనార్దన్‌రెడ్డిని పరామర్శించిన ప్రముఖులు



మర్రి జనార్దన్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రులు

తిమ్మాజిపేట: మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిని పలువురు ప్రముఖులు పరామర్శించారు. ఆయన తండ్రి మర్రి జంగిరెడ్డి ఏకాదశ దినకర్మ సందర్భంగా సోమవారం మాజీ మంత్రులు నాగం జనార్దన్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, మాజీ స్పీకర్ సురేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, అంజయ్య యాదవ్, స్వర్ణసుధాకర్‌రెడ్డి, పలువురు మాజీ జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, నాగర్‌కర్నూల్ నియోజక వర్గానికి చెందిన పలు పార్టీల నాయకులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అమిత్ షా మాటలు వెనక్కి తీసుకోవాలి



స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: భారతరాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు సీపీఎం ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సోమవారం ని రసన వ్యక్తం చేశారు. అమిత్‌షా వెంటనే రాజీనా మా చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్ధం ప ర్వతాలు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ శ్రీనివాసులు, నాయకులు గుంపల్లి అశోక్, తారాసింగ్, మధు, యాదయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

■ పెంట్లవెల్లిలో ర్యాలీ నిర్వహించారు. కొల్లాపూర్ పట్టణంలోని అమిత్ షా దిష్టిబొమ్మ దహనం చేశారు. తాడూరులో ధర్నా నిర్వహించారు. కోడేరు, కల్వకు ర్తి పట్టణంలో నిరసన చేపట్టారు.

శతాబ్ది ఉత్సవాలకు తరలిన సీపీఐ నాయకులు



నల్లగొండకు వెళ్తున్న సీపీఐ నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: నల్లగొండ పట్టణంలో జరుగుతున్న శతాబ్ది ఉత్సవాలకు నాగర్‌కర్నూల్ పట్టణం నుంచి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాల్‌నర్సింహ ఆధ్వర్యంలో 100 మందికి పైగా ప్రైవేట్ వాహనాలలో వెళ్లారు. ఈ సందర్భంగా బాల్‌నర్సింహ మాట్లాడారు. కొల్లాపూర్, బిజినేపల్లి, తెలకపల్లి, తాడూరు, చారకొండ మండలాల నుంచి సీపీఐ నాయకులు తరలివెళ్లారు.

పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్ల వితరణ

లింగాల: మండలంలోని చెన్నంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన స్వామి వివేకానంద యూత్ అసోసియోషన్ ఆధ్వర్యంలో సీలింగ్ ఫ్యాన్లను వితరణ చేశారు. హెచ్‌ఎం సతీష్ కుమార్, ఉపాధ్యాయులు యూత్ అసోసియోషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు భాస్కర్, లింగస్వామి, మల్లేష్, శ్రీశైలం, కె.లింగస్వామి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ ఎరువులు వాడండి



అచ్చంపేట రూరల్: రైతులు డీఏపీకి బదులుగా ప్రత్యామ్నాయ కాంప్లెక్సు ఎరువులు వాడాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రశేఖర్ కోరారు. సోమవారం అచ్చంపేటలో ఎరువుల దుకాణాదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎరువుల దుకాణా యజమానులు నిబంధనలు పాటించాలన్నారు. రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు కృష్ణయ్య, రమేష్, నరేష్, డీలర్లు పాల్గొన్నారు.

ఆరుతడి పంటలకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



లింగాల: యాసంగిలో సాగు చేసిన వేరు శనగ, మినుము పంటల విషయంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈఓ భరత్‌కుమార్ సూచించారు. సోమవారం మండలంలోని రాయవరం, క్యాంపు రాయవరం గ్రామాల శివారులలో సాగు చేసిన పంటలను పరిశీలించిన ఏఈఓ రైతులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. వేరు శనగలో తిక్కాకు మచ్చ తెగులు ఉధృతంగా ఉందని, దీని ఉధృతిని తగ్గించడానికి క్లోరోతాలోనిల్-400 గ్రాములను ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వేరు శనగ సాగు చేసిన 45 రోజుల తర్వాత ఊడలు దిగే సమయంలో ఎకరాకు 4 బస్తాల జిప్సం(200కిలోలు) అధిక దిగుబడులు వచ్చే అవకాశాలు ఉంటాయని తెలిపారు. మినుము పంటకు బూడిద తెగులు ఆశించి పంటకు నష్టం కలిగిస్తుందని, దీని నివారణ వ్యవసాయ శాఖ సూచనలు, సలహాలు పాటించి తగు మందులను వాడాలని ఏఈఓ సూచించారు.